క్లుప్తంగా

కుటుంబంలో పురుషుల భాగస్వామ్యంపై బైక్ ర్యాలీ



పెనమలూరు:కుటుంబంలో పురుషుల భాగస్వామ్యం పై అవగాహన కల్పించటానికి వణుకూరు గ్రామంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో 4వ అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. కుటుంబంలో పురుషు భాగస్వామ్యం, డిజిటలీకరణతో కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలకు మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వై.రమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, పురుషులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు మేలు



ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరులో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 పన్నుల తగ్గింపు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. రమేష్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 పన్నుల తగ్గింపు వల్ల ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ఎరువుల ధరలు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. దీనివల్ల వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గి రైతులకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ ప్రసాద్, సర్పంచ్ వరప్రసాద్, ఆముదాలపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన హ్యుందాయ్ కార్ల విక్రయాలు



రామవరప్పాడు: దసరా ఉత్సవాలు, జీఎస్టీ తగ్గింపుతో హ్యుందాయ్ కార్ల విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగాయని లక్కీ హ్యుందాయ్ జనరల్ మేనేజర్ రోహిణి కుమార్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని లక్కీ హ్యుందాయ్ షోరూమ్‌లో శనివారం పలువురు వినియోగదారులకు కార్లను డెలివరీ చేశారు. ఈ సందర్భంగా రోహిణి కుమార్ మాట్లాడుతూ.. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా రూపుదిద్దుకుంటున్న హ్యుందాయ్ కార్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయన్నారు. హ్యుందాయ్‌లో క్రెటా, వెన్యూ, ఎక్స్‌టర్ వంటి ఎస్‌యూవీ కార్లు దసరా సందర్భంగా అత్యధిక రిటైల్ విక్రయాలు సాధించాయన్నారు. చాలా మంది కస్టమర్లకు ఈనెలలో కూడా అత్యధిక డెలివరీలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఉచిత వైద్య సేవలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి దిగువునగల కనకదుర్గానగర్, పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటలపాటు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించామని తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నూరు హరినాథ్ ప్రసాద్, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ 12 రోజుల్లో సుమారు 50 వేల మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అలాగే ఫిజికెమ్ ఫౌండేషన్ అధినేత సీసీ కేశవరావు రథం సెంటర్‌లో ప్రసాదాల పంపిణీకి సహకరించారని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించిన డాక్టర్ కోలా విజయ శేఖర్ వైద్య బృందానికి, మందులు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక సభ్యులకు కృతజ్ఞతలు తెలియ చేశారు.

ప్రారంభానికి నోచుకోని బాపులపాడు పీహెచ్‌సీ భవనం

- తుదిదశలో నిర్మాణ పనులు నిలిపివేత
- నాలుగేళ్లుగా ఇరుకుగదిలోనే పేదలకు వైద్య సేవలు
- పట్టించుకోని కూటమి ప్రజా ప్రతినిధులు



తుదిదశ నిర్మాణంలో నిలిచిపోయిన బాపులపాడు పీహెచ్‌సీ నూతన భవనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా నిల్చిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1.45 కోట్ల వ్యయంతో బాపులపాడు పీహెచ్‌సీని ఆరు పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన భవనంలో అరకొర మౌలిక సదుపాయాలతో నెట్టుకొస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించినట్లైందని అంతా భావించారు. కానీ ఆ సంతోషం కొద్దినాళ్లే మిగిలింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల ముందు కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని అర్ధాంతంగా నిలిపివేశారు. ఇప్పటి వరకూ చేపట్టిన నిర్మాణానికి బిల్లులు మంజూరు కావటంతో గత్యంతరం లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో తుదిదశలో బాపులపాడు పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది.

రూ.1.45 కోట్లతో ఆస్పత్రి భవనం..

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు సమూలంగా మార్చుతూ, పూర్తిస్థాయి సదుపాయాలతో కొత్త భవనం నిర్మించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వైద్యులు, రోగులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి పడిపోవటం, వర్షం నీరు రాకటంతో గర్భిణులకు డెలివరీ చేయలేక వైద్యులు పొరుగు ఆస్పత్రికి పంపించేవాళ్లు. బాపులపాడు చుట్టూ పక్కల ఉన్న దాదాపు 15 నుంచి 20 గ్రామాల పేదలకు ఈ ఆస్పత్రే వైద్యానికి దిక్కు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.1.45 కోట్ల నిధులు బాపులపాడు పీహెచ్‌సీకి మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సువిశాల ప్రాంగణంలో నూతన భవనంలో ఆరు ఇన్ పేషంట్ గదులు, నర్సింగ్ రూం, డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, రెండు డాక్టర్ల గదులు, రిసెప్షన్ వంటి సదుపాయాలు కొత్త భవనం ప్లాన్‌లో ఏర్పాటు చేశారు.

మూడేళ్లుగా ఇరుకు గదిలోనే పీహెచ్‌సీ సేవలు..

రోజుకూ సగటున 100కుపైగా ఇన్ పేషంట్ సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రికి నూతన భవన నిర్మాణ పనులు రెండేళ్లుగా ఆగిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన నిర్మాణాన్ని ఆ తర్వాత సంబంధిత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో పూర్తి చేసిన నిర్మాణ పనులకు సైతం బిల్లులు మంజూరు కాకపోవటంతో కాంట్రాక్టర్ కూడా పనులు ఆపేశారు. పాత భవనం కూల్చివేతతో పీహెచ్‌సీని ఆయుష్ హోమియో ఆస్పత్రి బిల్డింగ్‌లోకి తాత్కాలికంగా మార్చారు. దీంతో గత నాలుగేళ్లుగా ఆ ఇరుగు గదిలోనే పీహెచ్‌సీ నడుస్తుంది. డాక్టర్లు ఇన్ పేషంట్లకు వైద్య పరీక్షలు చేసేందుకు, ఫార్మసీలోని మందులు భద్రపర్చేందుకు, ల్యాబ్‌లో పరీక్షలు చేయటానికి, రోగులు వేచి ఉండేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. తాత్కాలిక భవనంలోనే పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నెట్టుకొస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసంపూర్తిగా నిల్చిన పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోకపోవటంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి నూతన పీహెచ్‌సీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాడి రైతులకు రూ. 5.54 లక్షల బోనస్ పంపిణీ



పాడి రైతులకు బహుమతి అందజేస్తున్న పార్థీ, నరేంద్ర

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో శనివారం పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ చేశారు. సంఘ సభ్యులైన 140 మంది పాడి రైతులకు రూ. 5.54 లక్షల బోనస్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ జనరల్ మేనేజర్ డాక్టర్ పార్థీ, సంఘం అధ్యక్షులు గొంది నరేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా పార్థీ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు తప్పనిసారిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని చెప్పారు. పాడి రైతుల ఒక వాటా ఇన్సూరెన్స్ చెల్లిస్తే, మిగిలిన రెండు వాటాలను సంఘం, కృష్ణా మిల్క్ యూనియన్ చెల్లిస్తుందన్నారు. సంఘం అందిస్తున్న బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 2024-25లో సంఘానికి వచ్చిన రూ. 9.90 లక్షలు నికర లాభంలో 70 శాతం పాడి రైతులకు బోనస్‌గా అందజేసినట్లు నరేంద్ర తెలిపారు. అనంతరం అత్యధికంగా గేదె, ఆవు పాలు పోసిన రైతులకు బహుమతులను పంపిణీ చేశారు. క్లస్టర్ మేనేజర్ టి. యశ్వంత్, రూట్ సూపర్‌వైజర్లు పి. రాజీవ్, ఆంజనేయులు, వేతన కార్యదర్శి వి. నాగరాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేత



చెక్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్, అధికారులు

పెనమలూరు:నియోజకవర్గ పరిధిలో ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందచేశారు. పోరంకి కిలారు అనీల్‌ఎస్టేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఆటో వర్కర్‌లకు ఇచ్చిన హామీని నేడు అమలు చేశామన్నారు. ఆటో వర్కర్‌లకు తలా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ప్రభుత్వం ఆటో వర్కర్ల ఖాతాలో నేరుగా సొమ్ము జమచేసిందని వివరించారు. పెనమలూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ 3.9 కోట్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇందులో తాడిగడప మున్సిపాలటీలో 1029, పెనమలూరులో 336, ఉయ్యూరులో 304, కంకిపాడులో 397 మంది కలిపి మొత్తం 2066 మందికి పథకం అమలు చేశామని వివరించారు. తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ షేక్.నజీర్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.మురళీకృష్ణ, మోటార్ వెహికల్ అధికారి సుబ్బారావు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల ఎంపీడీవోలు బండి ప్రణవి, పి.అనూష, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో మంచి ఆరోగ్యం



వీరపనేనిగూడెంలో పోషకాహార సదస్సులో సర్పంచ్ జేజమ్మ, సూపర్‌వైజర్ సత్యవాణి

గన్నవరం రూరల్: జీవన శైలి, ఆహార అలవాట్లు మార్పుతో మంచి ఆరోగ్యం సాధించాలని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ సూచించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు జాతీయ పోషణ మహా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లతో తల్లులు బిడ్డలకు మంచి పోషకాహారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఇంటి ఆవరణలో చెట్లు పెంచటంతో పాటు, కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. తల్లులు వంట ఇంట్లో పోషకాహారం తయారు చేసుకోవాలని విధానాలు వివరించారు. అంగన్వాడీ టీచర్, ఆయాలు పోషకాహారం తయారు చేసి ప్రదర్శించి, గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి



ధర్నా పోస్టరును ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉయ్యూరు: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో ఈనెల 7న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ కోరారు. ఉయ్యూరు సీఐటీయు కార్యాలయంలో శనివారం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రటరీ పి.ఇమ్మానుయేలు మాట్లాడుతూ 4 డీఏలను విడుదల చేయాలని కోరారు. ఏకీకృత సర్వీసురూల్స్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బి.లంకేష్, బీవీ రమణ, సురేష్, లక్ష్మణరావు, శ్రీధర్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం సబ్‌జైలును సందర్శించిన జిల్లా జడ్జి

గన్నవరం:స్థానిక సబ్‌జైలును శనివారం జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. గోపి సందర్శించారు. తొలుత సబ్‌జైలులోని సదుపాయాలను, ఖైదీల బ్యారక్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని చెప్పారు. జైలులో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జేవీ కృష్ణయ్య, మండల చైర్మన్, సబ్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. గాయత్రి, సబ్‌జైలు సూపరింటెండెంట్ రాంబాబు, పానల్ లాయర్, పలువురు కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య నిర్దేశనతో విజయం సాధ్యం



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

ఉయ్యూరు: విద్యార్థులు లక్ష్య నిర్దేశనతో కష్టిస్తే విజయం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఉయ్యూరు విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు కైవసం చేసుకున్నారు. క్లాసికల్ ఫ్రీస్టయిల్ డ్యాన్స్‌లో మైథిలి ప్రథమ స్థానం సాధించింది. ధూళిపూడి శేషగిరిరావు పర్యవేక్షణలో ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో సాయి రాఘవ ప్రథమ, సబ్‌జూనియర్స్ విభాగంలో ధనస్య , హేమ, కార్తీక్ కుమార్‌లు ప్రథమస్థానంలో నిలిచారు. ప్రతిభావంతులైన విద్యార్థులను శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ జాస్తి రామారావు, పంద్రాజు చిరంజీవి అభినందించారు.

వన్‌టౌన్ పీఎస్‌లో వైభవంగా చండీ హోమం



వన్‌టౌన్ పీఎస్‌లో పూజలు నిర్వహిస్తున్న సీపీ రాజశేఖరబాబు సీఐ గురుప్రకాష్



అన్నదానం ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్

- పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికిన సీపీ రాజశేఖరబాబు
- పోలీసు అధికారులకు, పేదలకు అన్నదానం



చండీహోమం నిర్వహిస్తున్న సీఐ గురుప్రకాష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో చండీ హోమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, పలువురు ఐపీఎస్ అధికారులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే మహర్నవమి రోజున ఆయుధ పూజలు కూడా వైభవంగా నిర్వహించారు. విజయ దశమి రోజున సాక్షాత్ దుర్గమ్మ ఇంద్రకీలాద్రి కొండ దిగి పోలీసుస్టేషన్‌కు వచ్చి పూజలందుకొని తిరిగి వెళ్లింది. అటువంటి పలు కార్యక్రమాల అనంతరం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలాది మంది పేదలకు స్టేషన్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. పోలీసు కుటుంబాలు సైతం స్టేషన్ ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సీఐ గురుప్రకాష్, ఏసీపీ ఎన్.దుర్గారావు పర్యవేక్షించారు.

ఉత్సవాలను విజయవంతం చేశాం

తమ పోలీసు శాఖ అంకిత భావంతో పని చేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేశారని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు అన్నారు. వన్‌టౌన్ స్టేషన్ ప్రాంగణంలో పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. అధికారులందరూ కలిసికట్టుగా ఉత్సవాలను చక్కగా నిర్వహించారని కొనియాడారు. దసరా వేడుకలకు 16 లక్షల మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. 13 రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. వేలాది మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు.

అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 9 నెలలు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబేడ్కర్ స్మృతివనం మెయిన్ గేటు వద్ద భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల నిరసన భిక్షాటనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు, హక్కుల సాధన కోసం శాంతియుతంగా చేస్తున్న నిరసనను అడ్డుకోవటం అన్యాయమన్నారు. అంబేడ్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని అధికారులు, కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

అడుక్కోవలసిన దుస్థితి ఏర్పడింది..

కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు సకాలంలో ఇవ్వకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు అడుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదమరిస్తే... ప్రమాదమే...



మంతెన-ఉప్పలూరు డొంక రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు

కంకిపాడు: మంతెన-ఉప్పలూరు డొంక రోడ్డు మార్గం ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడ పంట పొలాల్లోకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో ఒక దానిపై నాపరాయిని ఉంచారు. అయితే అది కూడా ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో ద్విచక్రవాహనదారులు అధికంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రత్యేకించి మలుపు వద్ద ఈ ప్రమాదకర గోతులు ఉన్నాయి. పెను ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా దుర్గమ్మ తల్లి ఊరేగింపు



కంకిపాడు: దుర్గమ్మతల్లి ఊరేగింపు మహోత్సవం వైభవంగా సాగింది. మండలంలోని ఉప్పలూరు గ్రామంలోని ప్రధానసెంటరులో దసరా నవరాత్రులు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన దుర్గమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి ఉత్సవ మూర్తిని గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, పూజలు చేశారు. గురు భవానీ కొండవీటి శివయ్య పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేది వరకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14 బాల, బాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ. సునీల, కార్యదర్శి డి. నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 7న బాలికలు, 8న బాలుర విభాగాల్లో, 9న బాల, బాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ, మధ్యాహ్న భోజన ఫారంలను ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సంతకాలు చేయించి అందజేయాలని సూచించారు.

నేడు గన్నవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ ఈ. రామమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కరెంట్ ఆఫీస్ వద్ద రామాలయం ఏరియా, గ్యాస్ కంపెనీ ఏరియా, తహసీల్దారు కార్యాలయ ప్రాంతం, శ్రీనగర్‌కాలనీ, గాంధీబొమ్మ సెంటర్, గౌడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, వీనస్ బజార్, శాంతి థియేటర్ ఏరియా, మెయిన్ రోడ్డు మొత్తం, బుద్దవరం రోడ్డు, సుబ్బారావు నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మోహన్‌రావు

కంకిపాడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన బీవీఆర్ మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో మోహన్‌రావును పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తున్నట్లు పేర్కొంది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురిని రాష్ట్ర బీసీ విభాగ కమిటీలో నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా మానం వెంగయ్య యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా బంకా నాగేశ్వరరావు నియమితులైనట్లు పేర్కొంది.

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. కండ్రికలోని రాష్ట్ర కమిటీ కార్యాలయంలో ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పిమ్మట ముస్లింలకు సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. పేదల కుటుంబాలలోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. సంక్షేమ పథకాల సీఎంగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేరు స్థిరస్థాయిగా గుర్తుంటుందన్నారు. కమిటీ నగర కార్యదర్శిగా ప్రజాశక్తి నగర్‌కు చెందిన మహమ్మద్ ఉమర్ ఫారూఖ్‌ను నియమించి నియామక పత్రాన్ని షేక్ నాగుల్ మీరా అందజేశారు. కమిటీలో చేరిన ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి సిలార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.